

అభివృద్ధికి నోచని గుత్తి రైల్వే జంక్షన్

- స్టేషన్ మీదుగా వెళుతున్నా ఆగని పది రైళ్లు
- నాలుగు రైళ్లను దారి మళ్లించిన వైనం
- స్టేషన్లో సమస్యల తిష్ట



గుత్తి రైల్వే జంక్షన్

ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. 157 ఏళ్ల క్రితం నిర్మించిన రైల్వే జంక్షన్‌లో నాలుగు రైలు మార్గాలు ఉన్నాయి. చెన్నై-ముంబయి, బెంగుళూరు-హైదరాబాదుకు రైలు మార్గాలు ఉన్నాయి. గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా 122 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. స్టేషన్లో రెండు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. అదనంగా నిర్మిస్తున్న మరో రెండు రైల్వే ప్లాట్‌ఫారం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ పనులు పూర్తి చేస్తే స్టేషన్లో మరిన్ని రైళ్లు ఆగేందుకు అవకాశం ఉంది.

ప్రజాశక్తి - గుత్తి

గుత్తి రైల్వే సేష్టన్ మీదుగా ప్రతిరోజు దాదాపు 30 రైళ్లు వెళ్తుండగా అందులో 24 ఎక్స్ ప్రెస్, 6 ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. అధికంగా రైళ్లు వారానికి ఒకటి, రెండుసార్లు స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే ఈ మార్గాల గుండా నిత్యం దాదాపు 60 గూడ్స్ రైళ్లు వెళుతున్నాయి. వాటి ద్వారా బొగ్గు, ఐరన్ ఓర్, సిమెంటు కంకర, ఆహార ధాన్యాలను రవాణా చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి దేశ రాజధానికి ప్రజలు వెళ్లడానికి ఒక రైలు కూడా లేదు. వందలాది రైళ్లు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న రైల్వే స్టేషన్ లో సమస్యలు తిష్ట వేశాయి. రాకపోకలు సాగిస్తున్న పది రైళ్లు స్టేషన్లో ఆగడం లేదు. తిరుపతి -హజరత్ నిజామొద్దీన్ (12708,12707), సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ రైళ్లు, కాచిగూడ- మదురైకు రాకపోకలు సాగించే ఎక్స్ ప్రెస్ రైళ్లు (22715,22716), జైపూర్-మైసూర్‌కు రాకపోకలు సాగించే రైళ్లు (12975,12976), యశ్వంతపూర్- కోర్బా (12251,12252) ఎక్స్ ప్రెస్ రైళ్లు, రామేశ్వరం- ఓకాకు వెళ్లి వస్తున్న ఎక్స్ ప్రెస్ రైళ్లు (16733,16734), కొంగు సూపర్ ఫాస్ట్ (12647,12648) రైళ్లతోపాటు కాచిగూడ- యశ్వంత్ పూర్ కు వెళ్లే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు గుత్తి మీదుగా వెళుతున్నా స్టేషన్లో ఆగటం లేదు. గతంలో గుత్తి రైల్వే స్టేషన్ గూండా వెళ్లే కర్నాటక ఎక్స్‌ప్రెస్(12627,12628), కుర్లా ఎక్స్ ప్రెస్ (11013,11014) రైళ్లు దారి మళ్లించారు. అనంతపురం నుంచి గుంతకల్లు మీదుగా ఆ రైళ్లు వెళుతున్నాయి.గుత్తి మీదుగా వెళుతున్న విజయవాడ నుంచి బెంగళూరు ప్యాసింజర్ రైళ్లు (56503,56504) కరోనా సమయంలో రైల్వే అధికారులు నిలిపివేశారు. నాలుగు రైళ్లు దారి మళ్లింపు, రెండు రైళ్లు రద్దు చేయడంతో గుత్తితో పాటు చుట్టు ఉన్న ప్రాంతాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్ లో ఉన్న దుకాణాదారులు, స్టేషన్ బయట ఉన్న దుకాణదారులకు వ్యాపారాలు తగ్గి ఉపాధి కోల్పోయారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధికి గండిపడింది. స్టేషన్ నూతన భవనాల నిర్మాణం, అదనపు ఫ్లాట్ ఫాంలు ఏర్పాటు కోసం గత ఏడాది ఆఖరిలో రూ.354.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే ఇప్పటికి పనులు ప్రారంభం కాలేదు. స్టేషన్ లోకి ప్రయాణికులు వెళ్లడానికి ఎక్కలేటర్ లేదు. శిఖరంలా నిర్మించిన మెటికల మీదుగా వృద్ధులు, పిల్లలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లాట్‌ఫాంలో ఉన్న లిఫ్టు వారంలో రెండు మూడు రోజులు మాత్రమే పనిచేస్తుంది. ఉన్న రెండు లిఫ్టులు మొరాయిస్తే ప్రయాణికులు, రైల్వే అధికారులు, కార్మికులు, సిబ్బంది, అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్లో తాగునీటి సమస్య నెలకొంది. ఫ్లాట్ ఫాంలపై ఏర్పాటు చేసిన కొళాయిలకు కొన్నింటికి మాత్రమే నీరు వస్తోంది. ఫ్లాట్ ఫాంలలో ఒకవైపు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. మరొక వైపు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. స్టేషన్లో కోతుల బెడద అధికంగా ఉంది. ప్రయాణికులు తీసుకెళ్తున్న తినుబండారాల కోసం కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడితో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. టికెట్టు బుకింగ్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రం తరచూ మూతపడుతోంది. తద్వారా నగదు కోసం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి గుత్తి మీదుగా వెళుతున్న రైళ్లను స్టేషన్లో ఆగేలా, దారి మళ్లించిన రైళ్లను గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా త్వరతగతిన గుత్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలంటున్నారు.

జీవనోపాధి కోల్పోయాం



గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా వెళుతున్న నాలుగు రైళ్లను దారి మళ్లించారు. విజయవాడ-బెంగళూరు ప్యాసింజర్ రైలు కరోనా సమయంలో రద్దు చేశారు. ఆ రైలు రాకపోకలు లేకపోవటంతో తమ వ్యాపారాలు తగ్గి ఉపాధి కోల్పోతున్నాం. గుత్తి మీదుగా వెళుతున్న 10 రైళ్లు స్టేషన్లో నిలిపాలి. దారి మళ్లించిన నాలుగు రైళ్లను గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా నడపాలి. రద్దు చేసిన విజయవాడ - బెంగళూరు రైలును కొనసాగించాలి.

కెఎం.రంగనాయకులు,
దుకాణదారుడు,
గుత్తి ఆర్‌ఎస్.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి



గుత్తి రైల్వే స్టేషన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పలు రైళ్లను గుత్తిలో ఆపకపోవటం, దారి మళ్లించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుత్తి, పరిసర ప్రాంతాల ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కేటాయించిన రూ.354 కోట్ల నిధులతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టాలి. నూతన భవనాలను నిర్మించి, ఫ్లాట్ ఫాంల సంఖ్య పెంచాలి.

వి.నిర్మల,
సిపిఎం మండల కార్యదర్శి,
గుత్తి.



రైల్వే స్టేషన్‌లో పనిచేయని తాగునీటి కొళాయిలు



రైల్వే స్టేషన్‌లో ఎత్తైన మెట్లు

ఊసరవెల్లి 'రఘురామ' సిపిఎంకు క్షమాపణ చెప్పు..!

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజు సిపిఎం నాయకుడిపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా పార్టీకి క్షమాపణ చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.క్రిష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉండి నియోజకవర్గంలో 40 సంవత్సరాలుగా కాపురం ఉంటున్న 80 పేద కుటుంబాల ఇళ్లను అధికార మదంతో రఘురాం కష్ణమరాజు కూల్చివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించి నెల రోజుల్లోపు వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును అసభ్యంగా దూషించడం ఆయన అహంకారానికి నిదర్శనం అన్నారు. రాజకీయాలను వ్యాపారంగా చేసుకుని ఎన్నిలకో పార్టీ మార్చే ఊసరవెల్లి రఘురామ కష్ణమరాజుకు సిపిఎంను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. వ్యాపారం పేరుతో బ్యాంకుల నుంచి రూ. కోట్లు తీసుకుని వాటిని దివాళా తీయించిన రఘురామకష్ణమరాజు పేదలు ఇళ్లను కూల్చి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడని విమర్శించారు. ఈ చర్యలను సిపిఎం అడ్డుకోవడంతో భూస్వామ్య అహంకారం తలకెక్కి ఉపసభాపతి అనే విషయం మరచి మాట్లాడాడని, కనీస నైతిక విలువలు లేని ఇలాంటి వ్యక్తికి పదవులిచ్చిన కూటమి నేతలు ఆయన నోటిని అదుపులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పోరాడుతున్న సిపిఎం నాయకులను అసభ్య పదజాలంతో మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రఘురాం కష్ణమరాజు బేషరతుగా సిపిఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మూగజీవాల కోసం నీటి తొట్టెల ఏర్పాటు

ప్రజాశక్తి-గుత్తి

మూగజీవాల కోసం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు ఆదివారం నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వేసవికాలంలో పశువులు, పక్షులు దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ బి.జబ్బార్‌మియా తొట్టెలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కర్నూలు రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, గాంధీ కూడలి, అనంతపురం రోడ్డు రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో తొట్టెలు ఏర్పాటు చేసి నీటితో నింపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో పశువులు, పక్షులు నీటి కోసం ఇబ్బందులు పడకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేశామన్నారు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తిలో ఏర్పాటు చేసిన తొట్టె



తొట్టెలో నీరు తాగుతున్న ఆవు

ఆయుర్వేద వైద్యంతో ఉపయోగం

న్యాయమూర్తి టి.హరిత

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వంలో అన్నిరకాల జబ్బులకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఆయుర్వేద వైద్యం చేసేవారని జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి హరిత అన్నారు. ఆదివారం నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్రేయస్ గ్రాండ్‌లో రాష్ట్రీయ ఆయూష్ మెడికల్ అసోసియేషన్, ఆర్య వైద్య ఫార్మసీ కోయంబొతూరు ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యంలో కాన్సర్ చికిత్సకు సంబంధించిన నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంపై వైద్యులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మురళీధర్‌రావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బండారు నాగేశ్వరరావు, దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ డాక్టర్ వీరబోయిని నాగేశ్వరరావు, వైద్యులు సురేష్, శంకర్‌మహదేవ్, రహీమ్ సుల్తానా, బి.గోపాల్, పోగుల కుమారయ్య, శాంతిప్రియ, చక్రధర్, నల్లపాటి తిరుపతినాయుడు, పద్మనాభరెడ్డి, పాల నగరాజ, వీరబోయిని నాగరాజు, గూడురు రవికుమార్, భూమి నరసింహారెడ్డి, గౌరీశంకర్, శ్రీనివాసనాయక్, బి.ప్రభాకర్‌రెడ్డి, పాటిల్ ప్రభాకర్‌రెడ్డి, డి.పద్మనాభరెడ్డి, పరమేశ్వరరెడ్డి, నగరాజ పాల, వి.నాగరాజు, కృష్ణవేణి, ప్రశాంతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన బసవేశ్వర ప్రయివేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉరవకొండ మండల అధ్యక్షులు హిరణ్య డిమాండ్ చేశారు. ఉరవకొండకు చెందిన బసవేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ మద్యం బార్ పక్కన కట్టడం ఎంతవరకూ న్యాయమని విద్యార్థి సంఘం నాయకులు మండిపడ్డారు. ఆ స్కూల్లో వెంటనే ఆపాలని ఉరవకొండ నుంచి గుంతకల్ హైవే నందు స్కూల్ కట్టడం చిన్నపిల్లలకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. బసవేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిర్మాణాలు వెంటనే ఆపాలని ఉన్నత అధికారులను కోరారు. లేనిపక్షంలో విద్యార్థి ప్రాణాలతో చలగాటమాడితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ ం నాయకులు ప్రిన్స్, శివ, కుళ్లాయిస్వామి, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గరుగు చింతలపల్లిలో నాకాబందీ

పుట్లూరు : మండల పరిధిలోని గరుగు చింతలపల్లి గ్రామంలో ఎస్‌ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానిలు ఇళ్ల, కళ్లం దొడ్లు, పొలాలు, గడ్డివాములను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎ అనుమతులు ఇవ్వాలి

సంస్థ సేవలు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప


ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ జిల్లాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచి సంక్షేమాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) సేవలు నిలిచిపోకుండా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆర్‌డిటి సేవలకు అడ్డంకిగా నిధులు ఆపడాన్ని నిరసిస్తూ ఆర్‌డిటి సేవలు- ఆటంకాలు అనే అంశంపై ఏపి వ్యవసాయ కార్మిక, సంఘం, ఏపి రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా నిత్యం కరువు, వలసలు, ఆత్మహత్యలతో సతమతమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న దళిత, గిరిజన, బడుగుల జీవితాల్లో మార్పు తీసుకు రావడం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1969లో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పడిందన్నారు. ఈ ట్రస్టు ఎన్నో విప్లవాత్మకమైన అభివృద్ధిని ప్రజలు, ప్రభుత్వాలు, దాతల సహకారంతో చేసిందన్నారు. జిల్లాలో సెమి గవర్నమెంట్ లాగా ఆర్డీటీ సేవలు 3244 గ్రామాల నుండి 3896 గ్రామాలకు 4,51,200 కుటుంబాలకు విస్తరించాయని తెలిపారు. వివిధ సంస్థలు, దాతల సహకారంతో చేస్తున్న సేవలు విస్తరించడమే కాకుండా ప్రపంచ గుర్తింపు పొందిందని అన్నారు. అయితే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సేవా సంస్థలపై దాడిని పెంచిందన్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ చట్ట సవరణను తెచ్చి ఆర్‌డిటికి వస్తున్న నిధులకు ఆంక్షలు విధించడం పెరిగిందన్నారు. కుల, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న ఆర్‌డిటి మత ప్రచారాలు, మత మార్పిడులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేసి పేదలు, దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు ఇస్తున్న సేవలకు దూరం చేస్తోందన్నారు. దీంతో అన్ని రంగాలకు చెందిన ప్రజలు నష్టపోతారని తెలిపారు. తక్షణం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ చేయాలని, సంస్థకు నిధుల సమస్య తీరేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఆర్‌డిటి నిధులు, ఎఫ్ సిఆర్‌ఎల పునరుద్దరణ కోసం చర్చలు జరపాలన్నారు. ఈ విషయంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఆర్‌డిటి రక్షించుకునేందుకు ముందుకు వెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం.బాషా, ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, కెవిపిఎస్ రాష్ట్ర ఆధ్యక్షులు ఓ.నల్లప్ప, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఓబిలేసు, అనంత హుక్కల వేదిక సొమర రాహూల్, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. శివారెడ్డి, బిఎంకెఎస్ కేశవరెడ్డి, లత్తవరం మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, ప్రజా నాట్య మండలి శ్రీనివాసులు. ఆర్‌వి సాయకుమార్, హెచ్.గంగాధర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయ్ భాస్కర్





జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యతో పాటు యువత క్రీడలలో రాణిస్తే వారి భవిష్యత్తు బంగారు బాటగా మారి జీవితంలో స్థిరపడతారని జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయభాస్కర్ పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జోనల్, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో వివిధ క్రీడల్లో రాణించి పతకాలతోపాటు ప్రభుత్వాల నుంచి గుర్తింపబడిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహిస్తూ క్షేత్రస్థాయిలో పలుచోట్ల స్టేడియాలను నిర్మించింది. అయితే వాటి నిర్వహణ సరిగా లేకపోవడం, వాచ్‌మెన్‌లను నియమించకపోవడం వల్ల పలుచోట్ల స్టేడియంలు నిరుపయోగంగా మారుతున్నాయి. చివరకు అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వం వ్యయం చేసిన నిధులు వృథా అవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని నిర్వహణకు సంబంధించి తగిన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో గేమ్స్ కోటా ద్వారా ఎంపికైన వారు ఎందరో ఉన్నారు. అలాగే క్రీడల్లో మాత్రమే రాణించి చదువులో లేకుంటే ఆ క్రీడాకారులకు తగిన ఉద్యోగ అవకాశాలు ఉండవు. ప్రభుత్వం కూడా క్రీడా శాఖ ద్వారా అవసరమైన చోట స్టేడియంలు నిర్మించి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో క్రీడల అభివృద్ధి, శిక్షణలపై జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ప్రజాశక్తి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో మీ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

జవాబు : జిల్లాలో క్రీడల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాము. క్రీడలకు సంబంధించి ఐదుగురు శిక్షణ కోచ్‌లు ఉన్నారు. బాక్సింగ్, హాకీ, అథ్లెటిక్స్ (పరుగు, షాట్ పుట్), కత్తి యుద్ధం, జూడో తదితర క్రీడల పైన ఆసక్తిగల యువతకు కోచ్‌లు శిక్షణ ఇస్తారు. బాక్సింగ్, హాకీ క్రీడలు ధర్మవరం ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక స్థలంలో శిక్షణ ఇస్తాం. కత్తి యుద్ధం కదిరి జెడ్పీ పాఠశాలలో, అథ్లెటిక్స్ (పరుగు, షాట్ పుట్) క్రీడలు జిల్లాలో రామగిరిలోని క్రీడా వికాస్ కేంద్రంలో, షటిల్ పెనుకొండ క్రీడా వికాసం కేంద్రంలో, జూడో చిగిచర్ల జడ్పీ పాఠశాల గ్రౌండ్ లో శిక్షణ ఇస్తాం. ఈ శిక్షణ పొందిన వారు జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే క్రీడల పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.

ప్ర : గ్రామీణ క్రీడలకు అందిస్తున్న సహకారం ఏమిటి.?

జ: గ్రామీణ యువతకు ప్రోత్సాహం అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తుంది. అంతేగాక కళాశాలలో విద్యను అభ్యసించడానికి క్రీడా కోటా క్రింద మెడిసిన్, ఇంజనీరింగ్ తదితర రంగాల్లో సీట్లు పొందవచ్చు. ఇందుకు ప్రభుత్వం క్రీడలకు 2 శాతం సీట్లు కేటాయిస్తుంది. అలాగే క్రీడల్లో బాగా రాణించిన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అంటే పోలీస్, ఫైర్, ఫారెస్ట్, రక్షణ రంగాల్లో 3 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.

ప్ర: క్రీడా పోటీలు ఎక్కడెక్కడ నిర్వహిస్తారు.?

జ: మేము ఆయా క్రీడల్లో శిక్షణ మాత్రమే ఇస్తాము. జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అసోసియేషన్లు ఉంటాయి. అవి క్రీడల్లో బాగా రాణించిన వారిని ఎంపిక చేస్తాయి. అందులో బాగా రాణించి ప్రతిభ చూపించిన క్రీడాకారులకు నగదు బహుమతులు ప్రశంసా పత్రాలు అందిస్తారు. అలాగే చదువులో కూడా ప్రతిభ చూపించిన వారికి క్రీడ కోటా క్రింద ఉద్యోగాలు కూడా పొందే అవకాశం ఉంటుంది. గత ఏడాది మార్చి నుండి ఇప్పటివరకు సుమారు 1500 మంది యువతకు వివిధ క్రీడలలో శిక్షణ ఇచ్చాం.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? యువతకు మీరు ఇచ్చే సూచనలు సలహాలు ఏమిటి.?

జ: మా శాఖపరంగా సిబ్బంది కొరత ఉంది. సీనియర్ అసిస్టెంట్, అకౌంటెండ్, కోచ్‌ల కొరత ఉంది. బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు కోచ్‌లు అవసరం. ప్రస్తుతం అయితే ఉన్న వారితోనే సరిపెట్టుకుంటున్నాం. క్రీడాకారులకు మేము ఇచ్చే సలహా ఏమిటంటే క్రీడలతో పాటు చదువు కూడా ముఖ్యమే. క్రీడలు, విద్య అనేవి రెండు కళ్లు లాంటివి. ఈ రెండింటిలో రాణించే వారికి భవిష్యత్ బాగా ఉంటుంది. క్రీడల్లో రాణించి విద్య లేకపోతే ఉద్యోగ అవకాశాలు ఉండవు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలని యువతకు సలహా ఇస్తున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com



గ్రామీణ రోడ్లు అధ్వాన్నం..!

గుంతలమయమైన కురుగానపల్లి-కర్ణపుడికి దారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం నుంచి కురుగానపల్లి, కర్ణపొడికి గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారాయి. ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో దుస్థితికి చేరుకున్నాయి. రోడ్లను బాగు చేయాలని పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు నాయకులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఏ చిన్న పని చేసుకోవాలన్నా మండల కేంద్రానికి రావాల్సిందే. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లోనే వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాల వరకూ రోడ్లు గుంతలయంగా ఉంటున్నాయి. దీనికితోడు రోడ్లుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో కొన్నిచోట్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్లలో రాత్రిళ్లు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కర్ణపుడికి, కూరగానపల్లి గ్రామల ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన రోడ్డు

కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : మండలంలోని కొళగానహల్లి గ్రామంలో వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచే గంగపూజ, కుంకుమార్చన, పుష్పాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదం అందజేశారు.



అంధ, అనాథ విద్యార్థినులతో కలెక్టర్ వినోద్‌కుమార్

భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంధ, అనాథ బాలికలు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని మీనాక్షి సమ్మిలిత వికాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఇందులో భాగంగా సంస్థలో చదువుతున్న అంధ, అనాథ బాలికల క్షేమ సమాచారం, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి సమ్మిలిత వికాస కేంద్రం సంస్థ ద్వారా లబ్ధి పొందుతున్న బాలికలను అభినందిస్తూ భవిష్యత్తులో మంచి స్థాయికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవ నాయుడు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్, సంస్థ నిర్వాహకులు రవికాంత్ రమణ, టీచర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పహల్గాం దుర్ఘటన చాలా బాధాకరమని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఉగ్రవాదుల దాడి పిరికి పందల చర్య అని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ఆదివారం నగరంలోని రెండవ రోడ్ బహుద్దీన్ మసీద్ ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. వర్షంలోనే కాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరిపోవడంతో సెల్‌ఫోన్ లైట్‌లతో మృతులకు నివాళి అర్పించారు. ఈ ర్యాలీలో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దాదాగాంధీ, ముతవల్లి ఫరిదుద్దీన్, టిడిపి నాయకులు ఫయాజ్ భాష, తాజుద్దీన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, ఐఎంఎం మహబూబ్ బాషా, జాకీర్, సైపుల్ల బేగ్, కార్పొరేటర్ చంద్రమోహన్ రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, రాజీవ్ కాలనీ ఉపసర్పంచ్ మసూద్, ప్రకాష్, ఫరీద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాం ఘటన ప్రపంచాన్ని కదలించిందన్నారు. ఉగ్రవాదుల దాడి అమానవీయమని, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిని ఖండించి దేశ ఐక్యతను చాటుదామన్నారు.

శాంతి ర్యాలీలో నేతలు



ర్యాలీలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, ముస్లిములు

ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో అనేక సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)కు విదేశీ నిధుల (ఎఫ్‌సిఆర్‌ఎ) రిజిస్ట్రేషన్‌ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో లేఖను విడుదల చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ అనంతపురానికే కాకుండా ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ రాష్ట్రాల్లో దాదాపు 3,500 గ్రామాల్లో సేవలు అందిస్తోందన్నారు. దాదాపు ఐదున్నర దశాబ్దాలుగా రాజకీయాలకు సంబంధం లేకుండా ఆర్డీటీ సంస్థ పేదల అభ్యున్నతికి కృషి చేస్తోంద న్నారు. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించకపోవడంతో ఎంతో మంది జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి ఎనలేని సేవలు చేస్తోందన్నారు. ముఖ్యంగా అనంతపురం నగర శివారులో 32 ఎకరాల విస్తీర్ణంతో 2002లో ప్రారంభించిన అనంత క్రీడాగ్రామంలో క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, టెన్నిస్ తదితర క్రీడల్లో జాతీయ, అంర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్నారన్నారు. 1,433 సప్లిమెంటరీ విద్యాలయాల ద్వారా 2,801 ప్రాజెక్ట్ గ్రామాల్లో ఆర్డీటీ విద్యను అందిస్తోందన్నారు. ఏటా ఆర్డీటీ సెట్ నిర్వహిస్తూ పేద విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పాటునిస్తోందన్నారు. 8,112 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోంది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, వికలాంగులకు వేలసంఖ్యలో పక్కా గృహాలను నిర్మించిందన్నారు. కరోనా సమయంలో ఎందరో పేదలకు ఆర్డీటీ ఆయువు పోసిందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో ప్రతి సంవత్సరం 8.5 లక్షల మంది రోగులకు సేవలు పొందుతున్నారు. ఆర్డీటీ సంస్థ బత్తలపల్లి, కణేకల్లు, కళ్యాణదుర్గంలలో ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఏటా లక్షల మంది అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లకు చికిత్స అందిస్తోంది. ఐదున్నర దశాబ్దాలుగా ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరారు.



లేఖను చూపుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రతిభా విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈమేరకు ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతిమాట్లాడుతూ ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో చదువుతూ కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీపడుతూ ఉత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల చదువు కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్చుకుని పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టం వృథా కాకుండా పిల్లలు ఇలాంటి మంచి ఫలితాలు సాధించి ఆనందాన్ని పంచడం అభినందనీయం అన్నారు. ఉన్నతమైన భవిష్యత్తు కోసం పాటుపడుతూ తల్లి తండ్రులను అభినందించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, సిద్దు మాట్లాడుతూ ఇలాగే విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ఉన్నతమైన చదువులు చదివి తల్లి తండ్రుల కల సాకారం చేయాలని కోరుతూ వారిని అభినందించారు. సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, బాలల సంఘం నాయకురాలు ఉషారాణి, సరళ, నాగేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, నాగభూషణం, అజయ్, విజయ్, మహేష్, సురేంద్ర, మనోహర్, చరణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులో అతిథులు

లక్ష్య సాధనలో పుస్తకాల తోడ్పాటు కీలకం

విశ్రాంత ప్రిన్సిపల్ ఎం.రంగస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పుస్తకాల నుంచి అందే తోడ్పాటు చాలా కీలకమని ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రంగస్వామి తెలియజేశారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుస్తక వారోత్సవాలలో భాగంగా 5వ రోజు ఆర్ట్స్ కళాశాల మైదానం గేటు వద్ద ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో ఆయన హాజరై మాట్లాడారు. నాటి మహనీయులు మనకు అందించిన ఎంతో విలువైన సమాచారం పుస్తకాల్లో దాగి ఉందని పుస్తకాలు చదవడం ద్వారానే మనం అనేక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఈమధ్య కాలంలో వచ్చిన సివిల్స్ ఫలితాలలో ఎన్నికైన ఎక్కువ మంది అభ్యర్థులు పుస్తకాలను చదవడం ద్వారానే ఇది సాధ్యమైందని వారు అన్నారని దీన్ని బట్టి చూస్తే పుస్తకాలు యొక్క ప్రాధాన్యత ఎంత గొప్పదో మనకు అర్థమవుతుందని తెలియజేశారు. అంతర్జాతీయ సంస్థ యునెస్కో 1995లో ఏప్రిల్ 23ను ప్రపంచ పుస్తక దినోత్సవంగా ప్రకటించిందని ఆ రోజు నుంచి ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ ఎం.గోపాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ కె.హుస్సేన్ రెడ్డి, ధర్మవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ కొండయ్య, న్యాయవాది రసూల్ తదితరులు హాజరై పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు రామిరెడ్డి, వీరరాజు, విరుపాక్షి, తిరుపాలు, ప్రసాద్ రెడ్డి, రాధాకష్ణ, ప్రసాద్, బాబ్జాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.రంగస్వామి

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు సొంత ఖర్చులతో ఆదివారం తాగునీటిని సరఫరా చేశారు. గ్రామంలో కొద్దిరోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటేవారు. విషయం తెలుసుకున్న సంజీవరాయుడు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని వృథా చేయరాదన్నారు. కాలనీవాసులు ట్యాంకర్ నీటిని వరుస క్రమంలో పట్టుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన సంజీవరాయుడుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కూడేరు జట్టు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని బి.యాలేరు గ్రామంలో నిర్వహించిన పరిటాల రవీంద్ర క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కూడేరు జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీ లో బి.యాలేరు జట్టు, కూడేరు జట్టు తలపడ్డాయి. ఈ పోటీల్లో కూడేరు విజేతగా, రన్నర్‌గా బి.యాలేరు జట్టు నిలిచింది. అనంతరం విన్నర్ జట్టుకు రూ.30వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆత్మకూరు మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు బాలాజీ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కృష్ణమోహన్‌చౌదరి, నాయకులు వెంకటనారాయణ, పరిటాల సుబ్రమణ్యం, కర్రీ ఆవుల నాగరాజు, జోగి లక్ష్మీనారాయణ, ఈడిగ శివ, మొద్దు రామాంజి, ఈడిగ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న టిడిపి మండల ఇన్‌ఛార్జి మురళి

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి నాయకుల దాడిలో గాయపడిన మండల పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు అంజన్‌రెడ్డిని వైసిపి ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డి పరామర్శించారు. గత కొద్దిరోజుల క్రితం లోలూరుకు చెందిన టిడిపి నాయకులు అంజన్‌రెడ్డిపై దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న సాంబ శివారెడ్డి అంజన్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న శింగనమల మండలం చిన్నజలాలపురం గ్రామానికి చెందిన సి.హరినాథ్‌రెడ్డి (28) తండ్రి సి.ఆదిరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సాంబ శివారెడ్డి

'అనంత ఆణిముత్యాలు'కు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : అర్హులైన విద్యార్థులు అనంత ఆణిముత్యాల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్టీ, బిసి విద్యార్థులతో పాటు అంగవైకల్యం, యుద్ధ వితంతువులు, అమ్మాయిలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

అనంతపురం: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వంలో టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి ఆదివారం నగరంలోని అర్బన్ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపి పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకూ యువనాయకులు నారా లోకేష్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. బీమా కార్యకర్తలకు భరోసా అన్నారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కంటా దేవి, రమాదేవి, ఆది, చందు, నాగరాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : కళాశాల ఫీజు కట్టలేని నిరుపేద విద్యార్థినికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆర్థికసాయం అందజేశారు. కళ్యాణదుర్గం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన చనమల్లప్ప, చిట్టెమ్మ పెద్ద కూతురు అఖిల అనంతపురంలోని ఆదర్శ కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. ఈనేపథ్యంలో మూడవ సంవత్సరం ఫీజు కట్టులేక మూడు నెలల నుంచి విద్యార్థిని ఇంటి వద్దే ఉంటోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ విద్యార్థినికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో: ట్రస్ట్ కార్యదర్శి హరీష్, కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు ఆది, ఆంధ్ర తిప్పేస్వామి, మల్లికార్జున, చిరంజీవి, మహేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అనంతపురం

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం రూ.10 నుంచి రూ.20వేలకు నష్టపరిహారాన్ని హర్షిస్తూ ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి బెస్త సాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేపల హరి మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20వేలకు పెంచడం సంతోషకరమన్నారు. కష్టకాలంలో మత్సకారులకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర నాయకుడు కుళ్లాయప్ప, బెస్ట్ సాధికార కమిటీ సభ్యుడు షణ్ముఖ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి, అనంతపురం పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి బెస్త పవన్, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యోజన అధ్యక్షుడు మేక జశ్వంత్ వ్యాస్, బెస్త వెంకటేష్, బెస్త నారాయణస్వామి, బెస్త అశోక్, బెస్త శంకర్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

30న ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఈనెల 30వతేదీన బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వైద్యుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సౌజన్యంతో యల్లనూరు దొడ్లో హనుమంతు, రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైద్య శిబిరంలో కర్నూలు శ్రీచక్ర ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిధులు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులను పునరుద్ధరించాలని సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ జిల్లాలో దాదాపుగా 56ఏళ్లుగా అనేక సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా పేద రైతు, రైతు కూలీ, హరిజన, గిరిజన, వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా కేంద్రం అడ్డుకోవడం బాధాకరమన్నారు. వెంటనే కేంద్రం స్పందించి ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి టి.రామకృష్ణ, ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు చింతా ప్రసాద్, బండి కిష్టన్న, కిట్ట, కురువ కొండయ్య, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కరువు కాటకాలకు నిలయమైన అనంతపురం జిల్లాలో సేవలందిస్తున్న ఆర్డీటీకి వెంటనే విదేశీ నిధుల పునరుద్ధరణకు అనుమతులు మంజూరు చేయాలని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఆర్డీటీ సంస్థం కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిపుణల కమిటీని ఏర్పాటు చేసి 63 మండలాలు, గ్రామాలు, పట్టణాల్లో ఆర్డీటీ సంస్థ చేస్తున్న సాయం, ఉపాధి కల్పన, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించాలన్నారు.

4న మాదిగ ఎమ్మెల్యేల అభినందన సభ

ఉరవకొండ : అనంతపురంలోని మాసినేని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 4వతేదీన మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని మాదిగ సమాఖ్య ఫెడరేషన్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండలో ఏర్పాటు ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, తొలిసారిగా ఎమ్మెల్యేలు అయిన సందర్భంగా అభినందిస్తూ సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ సమాఖ్య ఫెడరేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ప్రకటించాలి

ఉరవకొండ : అంగన్వాడీ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించాలని గిరిజన ఐక్య సాధన సమితి వ్యవస్థాపకులు కేశవనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లలో 3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. 40 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు చిన్నారులు, గర్భిణులు, చిన్నపిల్లలను సెంటర్లకు తీసుకురావడానికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఆదివారం అనంతపురంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జోష్ణ అత్యంత ప్రతిభ కనబరిచి పాఠశాల టాపర్‌గా నిలవడంతో సిపిఎం నాయకులు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు.

నేటి నుంచి పెద్దమ్మ జాతర

ఆత్మకూరు : మండల పరిధిలోని సనప గ్రామంలో వెలసిన పెద్దమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రెండురోజులపాటు అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దాదాపు 35ఏళ్ల తర్వాత జాతర నిర్వహించనుండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచు గౌతమి, ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు.

సంఘీభావ ర్యాలీ

అనంతపురం : ఉగ్రదాడిని నిరసిస్తూ స్కేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రవిబాల, నాగేంద్ర, పిల్లలు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు విడుదల

ఉరవకొండ : మండలంలోని పెన్న అహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సోమవారం విడుదల చేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 9 నుంచి 20వతేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఎద్దుల బండి బోల్తా.. రైతుకు గాయాలు

గుత్తి : మండలంలోని అనగానిదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. అనగానిదొడ్డి గ్రామానికి చెందిన సుంకన్న అనే రైతు తన భూమిలో సేద్యం పనులు ముగించుకుని ఎద్దుల బండిలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎద్దుల బండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రైతును చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మొక్కజొన్న పంట దగ్ధం

యాడికి : మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామంలో రైతు నారాయణరెడ్డి పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట ఆదివారం అగ్నికి ఆహుతైంది. పక్కన పొలం వారు చెత్తకు నిప్పు పెట్టడంతో తమ పొలంలోని పంట దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు. ఈ ఘటనతో సుమారు రూ.లక్ష వరకూ నష్టపోయాయని ఆందోళన వ్యక్తం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి వెంకట్రామిరెడ్డి. సర్పంచు అశోక్‌రెడ్డి. వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు. వెంకట కృష్ణారెడ్డి, తదితరులు పొలాన్ని పరిశీలించి బాధిత రైతును పరామర్శించారు.